

# చెదిరిన స్వప్నం

స్మిత

లుకోకూడదనీ, వ్యక్తిత్వం లేకుండా బతకడం కంటే చావడం నయమనీ...' ఇలా ఎన్నో అభిప్రాయాలు. కాని, నాకు ఎదురయిందేమిటో తెలుసా? ఒయాసిస్సులా భ్రమింపజేసిన ఎండమావి.

వైవాహిక జీవితం గురించి కన్నెగా నేను కన్న కల—ఎంతటి సుందరస్వప్నం అది! చిలకా గోరింకల్లా మేమిద్దరం, శివపార్వతుల లాఉండే అత్తమామలు, 'వదినా' అంటూ నావెనుక తిరిగే మరుదులూ, ప్రతి శుభకార్యానికీ ఇంటికి వచ్చి, నా ఆతిథ్యాన్ని ఆనందంగా స్వీకరించే ఆడపడుచులు, 'అ[illegible] అంటూ నన్ను అభిమానించే వారి పిల్లలు ఇంతమందితోను నా జీవితనావ పూలపడవ లాగా సాగిపోవాలి. మా అనురాగానికి ప్రతీకలుగా ఒక చిట్టిబాబు, ఒక చిన్నారి పాప—బస్! వాళ్ళను నా ఆశలకు, ఆశయాలకు ప్రతిరూపాలుగా పెంచాలి. సంసారమంతా నేను లేకపోతే క్షణం గడవదనేలా ఉండాలి. ఇలా ఎన్నో, ఎన్నెన్నో ఊహలు. కాని ఒక్కటీ అనుభవంలోకి రాలేదు. ప్రీతీ! నా సంసారం వంటిది బహుశా మరెక్కడా ఉండదేమో! ఎన్నో ఉమ్మడి కుటుంబాల్లో తోడికోడళ్ళ కీచులాటలు, విడిపోవడాలు సాధారణంగా ఉన్నవే. కాని, నా కా సమస్య లేదు. నేనే పెద్దకోడలిని. మరుదు లిద్దరికీ ఇంకా పెళ్ళి కాలేదు. మా ఆడపడుచులు ముగ్గురూ శశాంక కంటే పెద్దవారే. పెద్దావిడకు ముగ్గురూ మగపిల్లలే. రెండవ ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. చిన్నాడవడుచుకు ఒకే పాప. నా పెళ్ళయ్యాకే పుట్టింది.

ఆ పసిదానికి ఊహ తెలిసేవరకూ నేనే తల్లి ననుకుంది. అలా పెంచాను. మా ఆడపడుచులు ముగ్గురూ ఉద్యోగాలు చేస్తున్నారు. నీకు తెలుసుగా! మెటర్నరీ లీవులో మూడు నెలలు ఇంట్లో ఉండడమే. ఆ తర్వాత పాలు పొయ్యడంనుండీ మిగిలిన అన్ని పనులూ నావే. పసిపిల్లలను పెంచడమంటే మాటలా? అందులోనూ పెంపకంగురించి నాకేం తెలుసనని?

మా అత్తగారు పార్వతీదేవిలా నిండుగా, పెద్దరికంతో నాకు అండగా ఉండాలని కలలు కన్నానే-ఆమె ఎలాంటి మనిషని చెప్పమంటావు? ఆవిడకు ఆరోగ్యం అట్టే బాగుండదు. ఎప్పుడూ ఆమె చెప్పినదే అందరూ వినాలి తప్ప, ఆమెమాత్రం ఎవరేం చెప్పినా వినదు. తల్లితండ్రులకు ఆమె ఒక్కర్తే కూతురట. వాళ్ళు ఈమె ఇష్టాన్ని కాదనలేదట ఎప్పుడూ. పెళ్ళయ్యాకకూడా ఆమెకు ఎదురులేకపోయింది. మామగారు ఆమె ధోరణితో రాజీ పడిపోయారే తప్ప మార్చడానికి ఏ ప్రయత్నమూ చెయ్యలేదు. ఉమ్మడి కుటుంబం ఆమెకు తెలియదు. మామగారితోపాటు కొత్త సంసారం ప్రారంభించి, కుటుంబాన్ని వృద్ధిలోనికి తెచ్చింది. ఆరుమంది పిల్లలనూ తన అరచేయి దాటకుండా పెంచింది. ఎవ్వరూ, దేనికీ అడ్డు చెప్పకపోవటంతో ఆమె భావాలు సనాతనంగా, భాష్యం ఆధునికంగా ఒకదాని కొకటి పొంతన లేకుండా తయారయాయి. ఏదో మామూల పల్లెలో పుట్టి, అక్షరజ్ఞానంకూడా సరిగ్గా లేని వ్యక్తి ఇలా ఇంతమందిని తన గుప్పిట్లో పెట్టుకుని, మహారాజ్ఞిలా వెలుగుతోందంటే ఏ శక్తి ప్రభావమో నాకు ఇప్పటికీ అర్థం కాదు.

మాచిన్నాడబడుచు కూతురికి ఏడాదిన్నర వయసు వచ్చేసరికి నాకు వేవిళ్ళు మొదలయ్యాయి. తిన్నది ఇమడకపోగా, ప్రపంచం అంతా తలక్రిందు లవుతున్నట్టుగా కళ్ళు తిరగడం, నీరసం, ప్రీతీ! ఆ తొమ్మిది నెలలు నరకం అనుభవించాను. బాధ కేవలం శారీరకమే అయితే భరించవచ్చు. కాని, మానసికంగా చిత్రవధ ననుభవిస్తూ క్షణక్షణం గడపాల్సి రావడం భయంకరం. అందరూ బయటకు వెళ్ళే వేళకు హడావిడిగా వెళ్ళిపోతుంటారు. చివర్లో కంచం ముందర పెట్టుకొని కూర్చుంటే కళ్ళలో నీరు సుళ్ళు తిరిగిపోయిది. అసలే సహించదు. పైగా ప్రతిదానికీ సూటిపోటి మాటలు. ఏమాట కా మాటే చెప్పుకోవాలి. ఓపిక లేకుండా నిస్త్రాణగా పడిఉంటే పాలో, పళ్ళరసమో తెచ్చి తాగించేది మా అత్తగారు. ఏం లాభం? ఆ ఇచ్చింది కాస్తా క్షణంలో విషంలా మారిపోయేలా మాటలు విసరడంలో ఆమెకు సాటి ఎవ్వరూ ఉండరు.

నేను ఇన్నేళ్ళు కష్టపడి ఈ ఇంటిని వృద్ధి చేశాను. నేను పోయిన మరుక్షణం మంచినీళ్ళిచ్చే వాళ్ళుకూడా ఉండరు. అందరూ అడుక్కుతింటూ దిక్కుల పాలవుతారు. అలా నాశనమైన రోజున గాని నా కష్టం మీకు తెలిసిరాదు!' ఇదీ, ప్రీతీ, ఆవిడ ధోరణి. ఇంచుమించు ఇదే భావంతో మాటలు విరుస్తూంటుంది.

అఫ్‌కోర్స్! నేను చదువుకున్నాను. అంతమాత్రాన సంసారానికి పనికి రానట్టేనా? ఇష్టారాజ్యంలా ఉండదలచుకుంటే ఇంతమందిలో కలిసిపోయేదాన్నా? సుఖానికి అంతం ఎక్కడుంది, ప్రీతీ! ఎన్ని సౌకర్యాలున్నా ఇంకా కావాలనిపిస్తుంది. అంతా మన మనసులోనే ఉంది. నేను స్వతహాగా ఏకాంతాన్ని అభిలషించినా, పదిమంది మధ్య గడపడానికే ఇష్టపడతాను. ఇందరిలో ఉండీ నేను ఎంత ఒంటరితనం అనుభవిస్తున్నానో తలచుకోవడానికే దుర్భరంగా ఉంది.

'ఇలాంటి పనికిమాలిన వాళ్ళకు పెళ్ళెందుకు చెస్తారో బుద్ధిలేకుండా. ఆంబోతుల్లా పెంచి ఇంకో కొంపకు సాగనంపితే ఆ సంసారం నడివీథిన పడ్డట్టే కదా!' అంటుంది మా అత్తగారు నిర్మొహమాటంగా. ప్రీతీ! నేను ఎంత అపురూపంగా పెరిగినా, నాకు అన్ని పనులూ నేర్పింది అమ్మ. కష్టమైన పనులు అని నేను అనుకున్నవికూడా పెళ్ళయ్యాక నేర్చుకున్నాను. అన్నివిధాలా అందరితో సర్దుకుపోవడానికే ప్రయత్నించాను. అందరూ ఎవరి పనులకు వాళ్ళు ఉదయం వెళ్ళి,



సాయంత్రం వస్తారు. ఏదైనా గొడవ పడ్డా మరచిపోతారు. కాని నేను? రోజంతా ఇంట్లోనే ఉండాలి. విదిలింపులు, సాధింపులు అన్నీ భరించాలి. అయినా నవ్వుతూనే ఉండాలి. విన్నావా, ప్రీతీ! నేను లేకపోతే ఇంట్లో ఎవ్వరూ క్షణం ఉండలేరట. ఎప్పుడైనా అమ్మ దగ్గరకెళ్ళి పదిరోజులుంటే చాలు, భోజనంకూడా మానేస్తారట.

'మేము నిన్ను ఎంత ప్రేమగా చూస్తున్నాము. ఇంకా మీ అమ్మావాళ్ళనే తలచుకుంటావెందుకు? కావాలంటే వాళ్ళే వచ్చి చూసి వెడతారు' అంటారు. 'వెళ్ళొద్దు' అనే బదులు 'నిన్ను చూడకుండా ఉండలేము' అనడం ఓ టెక్నిక్. కని, పెంచి, ఇరవై ఏళ్ళు తమదిగా ఉన్న బిడ్డ దూరమైతే స్పందించే మనసుంటుందని వీళ్ళకు తెలియదు. చెప్పినా అర్థం కాదు.

నేను, మాఅత్తగారు మాత్రం ఇంట్లో ఉంటామని చెప్పానుగా. ఆ సమయంలో ఆవిడ ఎన్నో విషయాలు చెబుతూంటుంది-శశాంకకు ఎంతెంత అందమైన అమ్మాయిలను ఇస్తామన్నారో, వాళ్ళను చేసుకుని ఉంటే ఎన్ని లక్షల ఆస్తి, ఎన్నెన్ని ఎకరాల పొలం కలిసి వచ్చేదో...ఇలా ఒక్కో సంబంధం గురించి కథలాగా చెబుతూంటుంది.

ఎన్నోసార్లు చెప్పినవే మళ్ళీ మళ్ళీ చెప్పడమూ, నేను ఏడవలేక నవ్వుతూ ఊఁకొడుతూండడమూ మామూలే. ప్రీతీ! నా పెళ్ళయి నాలుగేళ్ళు అవుతోంది. ఇంకా ఇప్పుడా సంబంధాలను పదేపదే తలచుకోవడ మెందుకు? వాళ్ళలోనే ఎవర్నైనా చేసుకుని ఉండాల్సింది. ఎవరు కాదన్నారు? ఆవిడ మనసులో ఏ ఉద్దేశం ఉన్నా, నా మనసు గాయపడుతుందనే ధ్యాస మాత్రం ఉండదు.


శశాంకతో జీవితం పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తుంటాను. అంతటి ఉదాత్తుడితో బతుకుతూకూడా, జీవితాన్నిలా శాపంగా అనుభవిస్తున్నానంటే, అతిమంచితనం కూడా ఒక్కోసారి అన్ని అనర్థాలకూ మూలం అనిపిస్తుంది. నాలో రగిలే అశాంతి, అగ్నిజ్వాలలు శశాంకకూ తెలుసు. నిస్సహాయంగా నన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చగలరే తప్ప, నా బాధనుంచి విముక్తి కలిగించలేరు.


ప్రీతీ! కడుపుతో ఉన్నప్పుడు ఏ ఆలోచనలు ఉంటే, ఎవరిని తలచుకుంటే అలాగే పిల్లలు పుడతారట. నేను అందుకే మనసు కుదుటపరచుకోవడానికి శతథా ప్రయత్నించేదాన్ని. శశాంక అలా నిదురలోకి జారుకోగానే అప్పటివరకు నిద్ర నటిస్తున్న నేను లేచి తదేకంగా ఆ ముఖంలోకి చూస్తూ కూర్చునేదాన్ని. నా కోరికల్లా ఒక్కటే. శశాంకలాంటి బాబునే కనాలి. ఆ తర్వాత లోకాన్ని చూడకుండా కన్ను మూయాలి. కాని, నా కోరిక పూర్తిగా ఫలించలేదు. ముమ్మూర్తులా శశాంకను పోలిన బాబుకు తల్లినయ్యాను గాని, మృత్యువును చేరలేకపోయాను.

ఆ పసివాడి నవ్వుల్లో, చేతల్లో ఏవో ఆశలు—బతుకుపై తీపి కలలు— నా జీవితానికి కొత్తదనం తెస్తాడని నవీన్ అని పేరు పెట్టుకొన్నాను. అయిదవ నెలలో వాడినెత్తుకుని ఇక్కడికి రాగానే శ్వేతను చూసి ఏడ్చినంత పని చేశాను. శ్వేత అంటే మాచిన్నాడబడుచు కూతురు. నానుంచి దూరమైన ఈ ఆర్నెల్లలోను చాలా మారిపోయింది. ఆవురుమంటూ నన్ను హత్తుకుపోయిన శ్వేతను ఆర్తిగా అక్కున చేర్చుకున్నాను. పసివాడైన నవీన్ కంటే ఊహ తెలిసిన శ్వేతే ఎక్కువగా నాదగ్గర ఉండేది. మామధ్య పెనవేసుకున్న మమతానుబంధాన్నికూడా మాఅత్తగారు నిర్దయగా నిరసిస్తారు.

"పైపైన వేసే వేషాలు ఎవరికి తెలియవు? ఇన్ని నాటకాలు నేర్చిన వాళ్ళను ఎంతమందిని చూశానో!" అనేది.

అబ్బ, ప్రీతీ! అవి మాటలు కావు— మన




నును చిత్రవధ చేసే బాకులు. రోజురోజుకూ నాలో పెరిగిపోతున్న అశాంతిని ఎవరితో పంచుకోవాలి? ఇలా ఇంకెంతో కాలం ఈ బరువును నా గుండె మోయలేనంటోంది. తేదీలువేసి డైరీ రాసుకోవడమూ, వేయకుండా రాసుకోవడమూ అన్నీ అయ్యాయి. ఏం లాభం? మనసు విప్పి ఏదైనా రాశానంటే చాలు. ఇక ఆ డైరీకి కాళ్ళొచ్చేస్తాయి. ఎవరూ నా గదిలో అడుగుకూడా పెట్టరు. పుస్తకం కాదు కదా, చిన్న పేపరుకూడా ముట్టుకోరట. కాని నేనెందులో రాస్తానో అదిమాత్రం మాయమైపోతుంది. నా గదిలో ఎన్నో పుస్తకాలు, ఉత్తరాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటీ పోకుండా, కేవలం నా మనసు విప్పి రాసుకున్నది మాత్రం పోతోందంటే, వాట్ ఎ మిస్టీరియస్ థింగ్! ఫన్నీ కదూ. ఫన్నీనా ఇది? గుండె బద్దలవబోతున్న ఈ స్థితిలోనూ దీన్ని ఫన్నీ అనుకోగల సెన్సాఫ్ హ్యూమర్ ఉన్నందుకు నవ్వాలనిపిస్తోంది. నవ్వి నవ్వి అలసిపోయి ఆ నవ్వులలోనే భోరున ఏడుపొస్తోంది. వాట్ ఎ పిటీ!

ప్రీతీ! ఈ ఇంట్లో ఏ స్వతంత్రమూ, అధికారమూ నేను కోరుకోకూడదు. పోనీలే. కాస్త ప్రైవసీ అయినా వద్దా నాకు? పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి పడుకోబోయే వరకు ఇల్లు...ఇల్లు ...ఇల్లు!! అంతో ఇంతో చదువుకుని, కాస్తో కూస్తో విచక్షణ తెలిసిన నాకు ఈ ఇల్లు అనే పదమే భరించరానిది కావడం న్యాయమా? అఫ్‌కోర్స్, అన్యాయమే. బట్, దీనికి కారకులెవరు?

కూర్చుంటే, లేస్తే తప్పులు పడుతూ, ప్రతి చిన్న పనినీ, మాటనూ విమర్శిస్తూ, 'ఏమీ చేతకాని పొరంబోకులు సంసారం చేస్తాయా? కాలేజీల్లో చదివిన ఆడదానికి సింగారం కావాలిగాని, సంసారం కావాలా? వీటిని కూర్చోబెట్టి తిండి పెయ్యాలంటే ఎంత కష్టం?' అని దెప్పి పొడుస్తూ, అడిగి పనిచేస్తే 'అన్నీ చెప్పాల్సిందే. లేకపోతే గతీలేదు, మోక్షం లేదు' అనీ, అడగకుండా చేస్తే 'అహంకారమనీ— ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో తోచకుండా చేసే అత్తగారిది తప్పుకాదు.

సొంత పిల్లల్లా అందరినీ చూస్తున్నా, పదే పదే ఆక్షేపించే ఆడపడుచులదీ తప్పు కాదు. ఇంట్లో గొడవ చాలదని మొండితనంతో మరీ విసిగించే పిల్లలదీ తప్పు కాదు. మరెవరిదీ తప్పు? ఎవరిదో కాదు. నాది. ప్రీతీ, వింటున్నావా? నాదీ తప్పు!

"ఒక్క పనీ చెయ్యకుండా పుస్తకాలు చదువుతూ, పోకులు చేసుకుని కాలుమీద కాలేసుకుని, తిని తిరుగుతుంది" అని అనవ్యంగా తిట్టే మాఅత్తగారిదేం దోషం లేదట. కాని, 'అంతో ఇంతో పని చేస్తున్నాను-ఇలా చెడ్డ మాట లంటారే!' అని నే ననడమూ, అనుకోవడమూ మాత్రం చాలా పెద్ద తప్పట. ఎందుకో తెలుసా? ఆమె చదువుకోలేదట. అందుకని ఏమీ తెలియదట. మరి నేను చదువుకున్నాను కదా-అందువలన 'ఇదేమిటి' అని అడగకూడదు. మనసులో కూడా బాధ పడకూడదు. అదీ సంగతి. తెలుస్తోందా, ప్రీతీ!

అయినా, చదువు సంస్కారాన్ని ఇస్తుంది. చిన్న విషయాన్ని కూడా సునిశితంగా విమర్శించే ధోరణి అలవడుతుంది. ఎదుటివాళ్ళు ఏదైనా అనేసినా, ఎదిరించి మాట్లాడ్డానికి సంకోచంగా ఉంటుంది. 'తొందరపడి నోరు జారితే, నాలాగే బాధ పడతారు కదా!' అని తటపటాయింపుగా అనిపిస్తుంది. నా ఉద్దేశంలో చదువుకున్న కారణంగా నేను అలవరుచుకున్న వ్యక్తిత్వం అది. వివేకం, విచక్షణ పట్టుబడాలనే నా తల్లితండ్రులు నన్ను చదివించారు.

కాని, ప్రీతీ! ఈ చదువు ఇన్ని ఆంక్షలు పెడుతుందని, ఇంత నవ్వులపాలు చేస్తుందని, చివరకు మనసునే చంపుకోమంటుందని తెలిసుంటే నే నసలు చదువుకుని ఉండేదాన్నే కాదేమో! మొద్దు రాచిప్పలా పడుండేదాన్ని. అప్పుడీ సమస్య లుండేవి కాదు కదా! గొడ్డులాగా పని చేసి, ఉండేదేదో తినేదాన్ని. ఒక్క మాట నన్నంటే, తిరగబడి పది మాటలు అనేదాన్ని. ఎందుకంటే, 'నాకేం చదువా? సంధ్యా?' అనెయ్యొచ్చు కాబోలు! కాని...కాని, ప్రీతీ, ఇప్పుడేం చెయ్యగలను? ఎక్కడో తగిలిన గాయం కాదే నా చదువు మానిపోద్దా మనేందుకు-అందుకే ఎప్పటికీ 'తప్పు నాది'గా మిగిలిపోవాలి.

ప్రీతీ! మానసికంగా పూర్తిగా అలసిపోయాను. ఇక భరించలేనని మొరాయిస్తోంది సర్వమూ. నా మధుర స్వప్నం చెరిగిపోయింది. చెదరిపోతున్న మబ్బుల్లో కరిగిపోతోంది నీ 'స్వప్న'. నా ప్రాణం శశాంకను, నా ఆశాకిరణం నవీన్‌ను, నాదని భ్రమపడ్డ ప్రతి బంధాన్ని, మమకారాన్ని బలవంతంగా తెంచుకుని పోతున్నాను.

నేను మరణించినా, నాకు మిగిలేది చెడ్డ పేరే. అయినా సరే, ఈ మాయా బంధనాల రంగుల వల నుండీ, నా అభిమానాన్ని నిర్దయగా కాటువేసిన పరిసరాల నుండీ తప్పుకుంటే చాలు. అయినా, మనసులో ఏమూలో నేను దోషిని కాదని ఎలుగెత్తి చాటాలనే భావం!

కనీసం ఒక్కరు...ఒక్కరైనా నా మనసును గ్రహించి, రెండు కన్నీటి బొట్లు రాల్చాలనే ఆశతో, ఆర్తిగా ఇదంతా నీ ముందు ఉంచాను. ప్రీతీ, ఇదే నా చివరి లేఖ. ఇది నీకు అందేసరికే నేను దూరంగా, సుదూరంగా, ఎవ్వరికీ తెలియని తీరాలకో పయనిస్తుంటాను.

అందరూ ఉండీ, ఎవ్వరికీ ఏమీ కాకుండా కాలగర్భంలో కలిసిపోతున్న నా లాంటి జీవితం పగవాళ్ళకు కూడా ఇవ్వద్దని ఆ భగవంతుడికి చెబుతాను.

నీ లాంటి స్నేహమయి ప్రతి జన్మకూ కావాలని కోరుకుంటున్నాను. మరి సెలవా, ప్రీతీ!

నీ స్వప్న!